క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకారంలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం స్వామివారికి పల్లకిసేవ గావించారు.

వసతి గృహాల్లో దోమల మందు పిచికారీ



పొదలకూరు : పట్టణంలోని సచివాలయం బిట్-3 పరిధిలో ఉన్న వసతి గృహాల్లో పొదలకూరు కో-లొకేటెడ్ పీహెచ్‌సీ డాక్టర్ కిరణ్ రిషిత ఆధ్వర్యంలో మంగళవారం దోమల నివారణ మందును పిచికారీ చేశారు. డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్ గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు దోమల ద్వారా సంక్రమిస్తాయని ఈ సందర్భంగా డాక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు మస్తాన్‌బీ, సహాయకులు కామాక్షమ్మ, వెంకటేశ్వర్లు, అరుణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఓఆర్‌ఎస్‌ను అందుబాటులో ఉంచాలి



కొడవలూరు పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ దయాకర్

కొడవలూరు : ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో పీహెచ్‌సీలో తగినన్ని ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల నిల్వలు ఉంచాలని ఫ్యామిలీ డాక్టర్, జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ దయాకర్ సూచించారు. కొడవలూరు పీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను ఉపకేంద్రాల్లో సైతం అందుబాటులో ఉంచాలన్నారు. ఎండల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్ర సిబ్బంది ద్వారా గ్రామాల్లో అవగాహన కలిగించాలని చెప్పారు. ఆయా తేదీల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నారా.. అని ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రోగ్రామింగ్ ఆఫీసర్ వెంట వైద్యాధికారి జి.బాలచంద్రబాబు, సీహెచ్‌ఓ టి.సోమశేఖర్, హెచ్‌ఏ షఫీఉద్దీన్, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఆరుతడి పంటలను సాగు చేయాలి



మాట్లాడుతున్న ఏడీఏ మారుతీదేవి

పొదలకూరు : నీటి వసతి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో రైతులు ఆరుతడి పంటల సాగు చేయాలని రైతుశిక్షణ కేంద్రం నెల్లూరు ఏడీఏ సి.మారుతీదేవి సూచించారు. మండలంలోని పొదలకూరు, మరుపూరు, ఇనుకుర్తి, బిరదవోలు గ్రామాల్లో రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సీజన్‌లో బోర్ల కింద వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. మొక్కజొన్న, సజ్జ, వేరుశనగ, నువ్వు, పెసర, మినుము పంటలను సాగు చేసుకుంటే ఫలసాయం అందుతుందన్నారు. ఈ పంటలకు వరి కంటే ఆరురెట్లు తక్కువ నీటి అవసరం ఉంటుందన్నారు. ఈ సమావేశాల్లో ఏఓలు యు.గీతాకుమారి, శైలజ, చక్రవర్తి, ఈఏఓ వై.నాయక్, వీఏఏ చంద్రశ్రీ, గోవర్ధన్, సాయిగణేష్, శివ పాల్గొన్నారు.

ధనార్జనే నారాయణ ధ్యేయం



మాట్లాడుతున్న హఫీజ్‌ఖాన్

- కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): విద్యాసంస్థలు, హాస్పిటల్ ద్వారా డబ్బు సంపాదించడమే టీడీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి నారాయణ ధ్యేయమని, ప్రజలకు ఆయన ఎలాంటి సేవ చేయలేదని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ఆరోపించారు. 54వ డివిజన్లోని జనార్దన్‌రెడ్డి కాలనీ, 48వ డివిజన్లో గల మెక్లిన్స్‌రోడ్డు, మీరామొహిద్దీన్ దర్గా వీధి తదితర ప్రాంతాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్‌తో కలిసి ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తూ ప్రజలకు కరపత్రాలను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో రూ.100 కోట్లు ఖర్చుచేస్తే.. రూ.500 కోట్లు ఎలా సంపాదించాలనే ఆలోచన నారాయణది అని విమర్శించారు. ఖలీల్ అహ్మద్ సామాన్యుడని.. ప్రజల్లో కలిసిపోవడం ఆయన నైజమని చెప్పారు. నారాయణ, చంద్రబాబు లాంటి వారిని నమ్మితే మోసపోవడం తథ్యమన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా రాజకీయాల్లోకి జగనన్న వచ్చారని చెప్పారు. పుట్టిన గడ్డకు మంచి చేయాలనే ఆలోచనతో పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి బరిలో ఉన్నారని తెలిపారు. ఖలీల్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నిరంతరం ప్రజల్లో ఉండి సేవ చేస్తారన్నారు. ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపిస్తే అనేక అభివృద్ధి కార్యక్రమాలకు నిధులను తీసుకురాగలరని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అభ్యర్థిస్తూ ముస్లింలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. చంద్రబాబు డైరెక్షన్లో బీజేపీ, కాంగ్రెస్ వెళ్తున్నాయన్నారు. అనంతరం ఖలీల్ మాట్లాడారు. సామాన్యుడినైన తనకు ప్రజాసేవ చేసే అవకాశాన్ని సీఎం కల్పించారని చెప్పారు. నాలుగున్నరేళ్లు ప్రజలకు కనిపించని నారాయణ ఎన్నికలకు ముందొచ్చి అభివృద్ధి ప్రదాత అని చెప్పుకోవడం హాస్యాస్పదమని విమర్శించారు. నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసింది ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అని గర్వంగా చెప్తున్నామని పేర్కొన్నారు. కార్పొరేటర్ సఫియాబేగం, 48వ డివిజన్ ఇన్‌చార్జి సిద్దిఖ్, కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు జమీర్, నేత ఆనం జయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితుల పక్షపాతి సీఎం జగన్



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు సిటీ: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దళితుల పక్షపాతి అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత స్వర్ణా వెంకయ్య పేర్కొన్నారు. పార్టీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా రూరల్ పరిధిలోని 38వ డివిజన్ సరోజినీనగర్‌లో ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధిని కొనసాగించేందుకు గానూ తమ పార్టీని గెలిపించాలని కోరారు. ఎంపీగా విజయసాయిరెడ్డి.. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నేతలు బద్దెపూడి రవి, సునీల్, రాజా, హరిబాబు, బెల్లంకొండ వెంకన్న, తాటిపర్తి ఆనందరావు, బద్దెపూడి వెంకట్రావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై నిఘా పెంచాలి



మాట్లాడుతున్న హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(బారకాసు): ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో నగదు, మద్యం అక్రమ రవాణాపై నిఘా పెంచాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో ఎన్నికల నోడల్ ఆఫీసర్లతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద విస్తృతంగా తనిఖీలు చేపట్టాలన్నారు. సీజ్ చేసిన నగదుపై జిల్లా గ్రీవెన్స్ కమిటీ వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఎన్నికలకు కేటాయించిన అధికారులు, సిబ్బందికి విధుల ఉత్తర్వులను వెంటనే అందజేయాలని కోరారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన బస్సులను సిద్ధం చేయాల్సిందిగా రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన ఎస్సెస్టీ టీమ్‌లకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని సూచించారు. సీ - విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. డీఆర్వో లవన్న, ఎన్నికల నోడల్ ఆఫీసర్లు చందర్, నాగమల్లేశ్వరరెడ్డి, శ్రీధర్, విద్యాసాగర్, రామారావు, బాపిరెడ్డి, కన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మూడు నుంచి హోమ్ ఓటింగ్



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): హోమ్ ఓటింగ్‌ను శుక్రవారం నుంచి నిర్వహించనున్నామని, ప్రక్రియను పటిష్టంగా చేపట్టాలని నెల్లూరు సిటీ నియోజకవర్గ ఆర్వో వికాస్ మర్మత్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఎన్నికల సెక్టార్ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సిటీ పరిధిలో 160 మంది ఓటర్లు హోమ్ ఓటింగ్ ప్రక్రియలో పాల్గొననున్నారని తెలిపారు. ప్రక్రియ నిర్వహణకు అవసరమైన రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని సూచించారు. ఐదుగురు ఎన్నికల అధికారులకు సెక్టార్ల వారీగా బాధ్యతలను అప్పగించామని వివరించారు.

కరుణశ్రీ కవిత్వం గొప్పది



నరసింహారెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి కవిత్వం కమనీయ కల్పనలతో నిండి ఉంటుందని వ్యక్తిత్వ వికాస నిపుణుడు, వేద సంస్కృత కళాశాల విశ్రాంత తెలుగు రీడర్ డాక్టర్ కరిమద్దెల నరసింహారెడ్డి పేర్కొన్నారు. కరుణశ్రీ కమనీయ కవితారీతులు అనే అంశంపై పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం నరసింహారెడ్డిని సత్కరించారు. వీఆర్ కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకుడు మెట్టు రామచంద్రప్రసాద్, చేజర్ల వినయ, యజ్ఞావఝుల శేషగిరీశం, కోట రాజశేఖర్, గోవిందరాజు సుభద్రాదేవి, నలుబోలు బలరామయ్యనాయుడు, డాక్టర్ సుబ్రహ్మణ్యం, భాస్కర్‌రెడ్డి, విశ్వనాథం, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యానికి మార్గదర్శి శ్రీశ్రీ



నెల్లూరు(బృందావనం): తెలుగు సాహిత్యానికి మార్గదర్శి శ్రీశ్రీ అని కవి, రచయిత విన్నకోట మహేష్‌బాబు పేర్కొన్నారు. నగరంలోని నర్తకి సెంటర్‌లో మహాకవి శ్రీశ్రీ జయంతిని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మహేష్‌బాబును సత్కరించారు. కృష్ణమోహన్, వెంకటేశ్వరరావు, రామ్మూర్తి, రాము తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగమ్‌ను నగరంలోని ఆర్ అండ్ బీ అతిథిగృహంలో కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఆర్డీఓ మలోల, డీఎఫ్ఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో చీఫ్ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నెల్లూరుకు చెందిన విజయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో ఈఈ సోమశేఖర్‌రెడ్డి, డీఈఈ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ శివ ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేసి సత్కరించారు.

ఖర్చులను అభ్యర్థులు పక్కాగా చూపాలి

- ఆర్వో రాజారమేష్ ప్రేమ్‌కుమార్

ఉదయగిరి: ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల బరిలో ఉన్న వివిధ పార్టీల అభ్యర్థులు రోజువారీ ఖర్చుల వివరాలను పక్కాగా నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.రాజారమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ అభ్యర్థులు రోజు వారీ ఖర్చుల వివరాలను పక్కాగా నమోదు చేస్తుండాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఖర్చు పెట్టాలన్నారు. ఖర్చుల వివరాలపై వ్యయపరిశీలకులు తనిఖీలు చేపడతారన్నారు. ఖర్చుల విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. రూ.10 వేల లోపు ఖర్చుకు సంబంధించి నగదు చెల్లించవచ్చన్నారు. రూ.10 వేలు పైబడితే అకౌంట్ పే చెక్ ద్వారా చెల్లించాలన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు.

చుక్కల దుప్పిని కాపాడిన యువకులు

ఉదయగిరి: తాగునీటి కోసం జనారణ్యంలోకి వచ్చిన ఓ చుక్కల దుప్పిని కుక్కలు చుట్టుముట్టడంతో వాటి బారి నుంచి యువకులు రక్షించి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. పట్టణంలోని దేవలాలగడ్డలోకి అటవీ ప్రాంతం నుంచి చుక్కల దుప్పి జనారణ్యంలోకి వచ్చింది. దుప్పిని చూసిన కుక్కలు వెంటాడి గాయపరిచాయి. గమనించిన యువకులు దుప్పిని రక్షించి అటవీశాఖ రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డికి సమాచారం అందించారు. ఆయన వెంటనే సిబ్బందిని పంపి దుప్పిని స్వాధీనం చేసుకొని పశువైద్యశాలకు తరలించి చికిత్స అనంతరం దుర్గం అటవీ ప్రాంతంలో దుప్పిని వదిలేశారు. ఈ కార్యక్రమంలో ఏబీఓ వెంకటేశ్వర్లు, ఎఫ్‌బీఓ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామా



సీతారామపురం: మండలంలోని అయ్యవారిపల్లి సచివాలయ పరిధిలో పోలంగారిపల్లిలో ఐదుగురు, బాలాయపల్లి సచివాలయ పరిధిలోని దేవమ్మచెరువులో ముగ్గురు వలంటీర్లు మంగళవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. వారు మాట్లాడుతూ టీడీపీ, జనసేన అధినేతలు వలంటీర్ల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యవహరించినందుకు నిరసనగా తాము రాజీనామా చేశామన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ మండల నాయకుల ఆధ్వర్యంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు విజయసాయిరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి విజయానికి పని చేస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరిక



పార్టీలో చేరిన వారితో ఆదాల ప్రభాకర్‌రెడ్డి



నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు. వీరికి పార్టీ కండువాలను కప్పి పార్టీ రూరల్ నియోజకవర్గ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు.

- 38వ డివిజన్లోని ఫతేఖాన్‌పేటకు చెందిన 30 కుటుంబాలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. చిట్టిబోయిన నరేష్, సాయి, శరత్ తదితరులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ నేత మలిరెడ్డి కోటారెడ్డి, డివిజన్ ఇన్‌చార్జి దాసరి రాజేష్, బీసీ సెల్ రాష్ట్ర నేత హరిబాబుయాదవ్, నియోజకవర్గ పరిశీలకుడు మల్లు సుధాకర్‌రెడ్డి, వేమిరెడ్డి అశోక్‌రెడ్డి, దారా వంశీ, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.
- 29వ డివిజన్ గాంధీనగర్‌కు చెందిన వంద కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వీరికి కండువాలను కప్పి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానాన్ని కల్పిస్తామని ఆయన చెప్పారు. పార్టీలో రియాజ్, ఖదీర్, లక్ష్మి, జానకి తదితరులతో పాటు వారి మిత్ర బృందం చేరారు. పార్టీ నేతలు ఆనం జయకుమార్‌రెడ్డి, సూరిబాబు, ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, మాజీ కార్పొరేటర్ రావులపల్లి వెంకటజ్యోతి, రావుల అమర్‌నాథ్, కార్పొరేటర్ సత్తార్, జేసీఎస్ కన్వీనర్ కొండా సాయిరెడ్డి, జకీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాలకు మద్దతుగా ప్రచారం



ప్రచారం చేస్తున్న ఆదాల హిమబిందు

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డితోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని ఆదాల హిమబిందు పేర్కొన్నారు. తన తండ్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా 22వ డివిజన్లో ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా విజయసాయిరెడ్డి.. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాలను గెలిపించాలని కోరారు. కార్పొరేటర్లు మూలె విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, క్లస్టర్ - 2 అధ్యక్షుడు పాతపాటి పుల్లారెడ్డి, ఎమ్మెస్సెమ్ఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, పార్టీ నగర ఉపాధ్యక్షుడు వేలూరు శ్రీధర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి లంకా రామశివారెడ్డి, పార్టీ నగర మహిళాధ్యక్షురాలు కాకుటూరు లక్ష్మీసునంద, నేతలు రొంపిచర్ల సుబ్బారెడ్డి, శ్రీకాంత్, పాశం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మార్వాడీలకు అండగా ఉంటాం



నేహారెడ్డిని ఆశీర్వదిస్తున్న స్థానికులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని మార్వాడీలకు అండగా ఉంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నేత, పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి భరోసా ఇచ్చారు. నగరంలోని 47వ డివిజన్లో గల చిన్నబజార్‌లో ఎన్నికల ప్రచారాన్ని స్థానిక కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ తదితరులతో కలిసి మంగళవారం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సీఎం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధితో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. నేతలు దండుపాణి సురేష్, లక్ష్మి, ప్రగతి, ఇందిర, పద్మావతి, పార్టీ జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, కర్తం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో వైద్యానికి సహకరించరూ..



పరామర్శిస్తున్న ఏపీజీఈఎఫ్ నేతలు

నెల్లూరు(అర్బన్): రోడ్డు ప్రమాదంలో గాయపడి అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏడో వార్డు సచివాలయ వీఆర్వో సుమంత్‌కుమార్ వైద్యానికి ఉన్నతాధికారులు సహకరించాలని ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు, జనరల్ సెక్రటరీ దేవిరెడ్డి రమణారెడ్డి కోరారు. ఆస్పత్రిలోని ఐసీయూలో చికిత్స పొందుతున్న సుమంత్‌కుమార్‌ను మంగళవారం పరామర్శించిన అనంతరం ఏపీజీఈఎఫ్ నేతలు మాట్లాడారు. సుమంత్‌కుమార్ తండ్రి మరణించగా, తల్లి అనారోగ్యంతో బాధపడుతున్నారని చెప్పారు. చెల్లెలు మాత్రమే ఆస్పత్రిలో ఉన్నారని తెలిపారు. బిల్లులు భారీగా అయ్యాయని, ఉన్నతాధికారులు స్పందించి సాయం అందించాలని కోరారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరీష్‌రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల అధ్యక్షుడు సతీష్‌కుమార్‌రెడ్డి, ఏపీజీఈఎఫ్ నేతలు బాలు, మల్లికార్జున, శ్రీనివాసులు పాల్గొన్నారు.

38వ డివిజన్లో ప్రచారం



నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని 38వ డివిజన్ రమేష్‌రెడ్డినగర్, ఫతేఖాన్‌పేటలో ఎన్నికల ప్రచారాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు మంగళవారం నిర్వహించారు. ఏపీఆర్ ఆర్మీ సభ్యులు వైపీ రెడ్డి, శ్రీధర్, కల్లూరు లక్ష్మీరెడ్డి, అనితారెడ్డి, నరసింహారెడ్డి, రజనీ, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతాన్ని పెంచేలా చర్యలు



మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు(బారకాసు): రానున్న ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేలా చర్యలు చేపడుతున్నామని నెల్లూరు సిటీ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు నితిన్‌సింగ్ బదారియా పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులతో సమావేశాన్ని నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో ఆర్వో వికాస్ మర్మత్ నేతృత్వంలో మంగళవారం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి హ్యాండ్‌బుక్, ఐడీ కార్డులు, ఎలక్షన్ మెటీరియల్‌ను అభ్యర్థులకు అందజేశారు. ఈ సందర్భంగా నితిన్‌సింగ్ మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి సమస్యనైనా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం వికాస్ మర్మత్ మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను సమర్థంగా నిర్వహించేలా అన్ని చర్యలను చేపడుతున్నామని వెల్లడించారు.